## క్లుప్తంగా

### దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత



జానూకు బ్యాటరీ ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: జిల్లాలోని హెచ్ఎం పాడు మండలం హనుమంతునిపురం గ్రామానికి చెందిన భాద్దిపూడి జానూ అనే దివ్యాంగునికి శనివారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్ అందజేశారు. అంగవైకల్యంతో ప్రయాణించడం ఇబ్బందిగా ఉందని, ట్రైసైకిల్ ఇప్పించాలని అభ్యర్థించడంతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి అర్చనకు ట్రైసైకిల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేశారు.

### బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు ఆర్డీఓ



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన ఒంగోలు నూతన ఆర్డీఓ లక్ష్మీప్రసన్న

ఒంగోలు అర్బన్: ఒంగోలు ఆర్డీఓగా నియమితులైన కంభాలకుంట లక్ష్మీప్రసన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్, జేసీలు నూతన ఆర్డీఓకు సూచించారు. ఆర్డీఓను కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

### విధుల్లో చేరిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ



డిప్యూటీ సీఈఓ బాలమ్మకు అభినందనలు తెలుపుతున్న జెడ్పీ సిబ్బంది

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమితులైన పావులూరి బాలమ్మ శనివారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో విధుల్లో చేరారు. గుంటూరు జిల్లా తెనాలి డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిశారు. బాలమ్మకు జెడ్పీ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- జేడీఏ డాక్టర్ బేబీరాణి



పశుపోషకులకు మందులందిస్తున్న జేడీఏ బేబీరాణి

చీమకుర్తి: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ డాక్టర్ బేబీరాణి పశుపోషకులకు సూచించారు. శనివారం సంతనూతలపాడు మండలం బీ మాచవరం గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 47 పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటే ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్‌కు సమాచారం అందిస్తే ఏర్పాటు చేస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చీమకుర్తి, సంతనూతలపాడు పశువైద్య డాక్టర్లు పాల్గొన్నారు.



వరి పంట వేయడానికి ఆక్రమణదారుడు చదును చేసిన చెరువు స్థలం



ఆక్రమణకు గురైన పాదర్తి ఇరిగేషన్ చెరువులో ఒక భాగం



చెరువు ఆయకట్టులో సాగు చేస్తున్న వరి పంట

# పాదర్తి చెరువుపై పాగా..!

- 600 ఎకరాల ఇరిగేషన్ చెరువులో 100 ఎకరాలను ఆక్రమించి వరి సాగు
- పెరుగుతూ పోతున్న చెరువు ఆక్రమణలు
- పట్టించుకోని ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు
- చెరువులో తగ్గిన నీటి నిల్వలు
- 3 వేల ఎకరాల ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకం
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కొత్తపట్నం: ఇరిగేషన్ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొత్తపట్నం మండలంలోని పాదర్తి గ్రామం చెరువు సుమారు 100 ఎకరాలు ఆక్రమణకు గురైంది. మొత్తం 600 ఎకరాల్లో ఉండాల్సిన ఈ చెరువు 500 ఎకరాలే మిగిలి ఉంది. ఆక్రమణల కారణంగా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో ఆ చెరువు ఆయకట్టుగా ఉన్న 3 వేల ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువు ఆయకట్టులో పంటలు సాగుచేయాలా..వద్దా..? అని సంబంధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాలు, చెరువులే సాగునీటికి ఆధారం...**

కొత్తపట్నం మండలంలోని పొలాలకు డ్యాంల నుంచి సాగునీరు వచ్చే అవకాశం లేదు. దీంతో ఇరిగేషన్ చెరువులు, వర్షాలపైనే ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. వర్షాల నీటిని నిల్వ చేసుకునేందుకు చెరువులే కీలకం. అరకొరగా కురిసే వర్షాలకు చెరువుల్లో నిల్వ ఉండే కాస్త నీటితో అతి కష్టం మీద పంటలు సాగు చేస్తున్నారు. కొత్తపట్నం మండలంలోని అలాంటి చెరువుల్లో పాదర్తి ఇరిగేషన్ చెరువు ముఖ్యమైనది. ఒకప్పుడు మొత్తం 600 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు ఉండేది. దాని ఆధారంగా 3 వేల ఎకరాల ఆయకట్టులో వరి పంట పండిస్తున్నారు. మోటుమాల, పిన్నింటివారిపాలెం, గుండమాల, పాదర్తి, రంగాయపాలెం, కొత్తపట్నం, కె.పల్లెపాలెం రైతుల పొలాలు చెరువు ఆయకట్టు కింద ఉన్నాయి. మొత్తం ఏడు పంచాయతీల రైతులు పాదర్తి చెరువుపై ఆధారపడి వరిసాగు చేస్తుంటారు. చెరువుకు కమిటీ కూడా ఉన్నప్పటికీ వారి మాటకు లెక్క లేకుండా ఆక్రమణదారులు ప్రవర్తిస్తున్నారు.

**చెరువుతో పలు ఉపయోగాలు...**

పాదర్తి చెరువు సాగునీటికే కాకుండా గేదెలు, గొర్రెలకు నీళ్లు, మేతకు కూడా తోడ్పడుతోంది. కొంత మంది యానాదులు చెరువులో కొంతమేర విస్తీర్ణంలో పెరిగే చిల్లచెట్లను నరికి టన్నుల లెక్కలో అమ్ముకుని ఉపాధి పొందుతుంటారు. చెరువులోనే కొన్నిచోట్ల బోర్లు వేసి పొలాలకు నింపుకుని పంటలు పండించుకుంటున్నారు. వరదలు వచ్చినప్పుడు నీటిని ఈ చెరువుకే మళ్లిస్తారు. ఇన్ని ఉపయోగాలున్న చెరువును కొంత మంది ఆక్రమణదారులు కబ్జాచేసి దర్జాగా వరి పంట సాగుచేస్తున్నారు. దీంతో ఆ చెరువుపై ఆధారపడిన అసలైన ఆయకట్టు రైతులకు పంటలు సాగు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఒకరిని చూసి మరొకరు రోజురోజుకూ చెరువును ఆక్రమించుకుంటున్నారు. ఇప్పటికే సుమారు 100 ఎకరాలు ఆక్రమణకు గురైంది. పలువురు గ్రామస్తులు అధికారులకు చెప్పినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే కొనసాగితే పాదర్తి ఇరిగేషన్ చెరువు భవిష్యత్‌లో ఉండదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఈ నెల 3వ తేదీ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాదర్తి చెరువు ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పురిణి శ్రీను

**ఉపాధి కోల్పోతున్న కూలీలు...**

ప్రతి సంవత్సరం పాదర్తి ఇరిగేషన్ చెరువులో ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. మండలంలోని కొత్తపట్నం, గుండమాల, కె.పల్లెపాలెం, పిన్నింటివారిపాలెం, రంగాయపాలెం, పాదర్తి గ్రామాల ఉపాధి కూలీలు పాదర్తి చెరువులో పూడికలు తీయడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. చెరువులో పూడిక తీసిన మట్టి కూడా ఎంతో ఉపయోగపడుతోంది. ప్రస్తుతం ఈ చెరువు సుమారు 100 ఎకరాలు ఆక్రమణకు గురవడం కారణంగా కూలీలు కూడా ఉపాధి కోల్పోతారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని కూడా ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఈ నెల 3వ తేదీ మోటుమాల గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మోటుమాల గ్రామస్తుడు పురిణి శ్రీను ఫిర్యాదు కూడా చేశారు. అధికారులను పంపించి ఆక్రమణలు తొలగిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏ మేరకు ఆచరిస్తారో వేచి చూడాల్సి మరి.

**అడ్డుకట్ట వేయకపోతే చెరువంతా ఆక్రమించుకుంటారు**



పాదర్తి ఇరిగేషన్ చెరువును ఒకరిని చూసి మరొకరు ఆక్రమించుకుంటున్నారు. ఇలాగే చూస్తూ ఉంటే చెరువంతా ఆక్రమించుకుంటారు. సెంటు భూమి కూడా మిగలదు. చెరువుపై ఆధారపడి ఉన్న ఆయకట్టు రైతులు పంటలు వేసుకునే పరిస్థితే ఉండదు. రానున్న రోజుల్లో ఆయకట్టు మొత్తం బీడు భూములే మిగులుతాయి. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

– యానాది, రైతు, పాదర్తి

**ప్రతి సంవత్సరం మరమ్మతులు చేపట్టాలి**



ఇరిగేషన్ చెరువుకు ప్రతి సంవత్సరం మరమ్మతులు చేపట్టాలి. చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేస్తే ఆక్రమణకు గురికాదు. దానిని శుభ్రం చేయకుండా వదిలేస్తేనే ఆక్రమణకు గురవుతుంది. ఇరిగేషన్ చెరువు విస్తీర్ణం ఎంత ఉందో కొలతలు వేసి ఫెన్సింగ్ వేయాలి. అలాగైతేనే ఆక్రమణదారులకు అవకాశం ఉండదు. అధికారులు వెంటనే ఆ మేరకు చర్యలు తీసుకోవాలి.

– బొమ్మిడాల శంకర్‌రావు, కొత్తపట్నం

**ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి**



ఇరిగేషన్ చెరువును ఎవరైతే ఆక్రమించారో వారిపై కేసులు నమోదు చేయాలి. అప్పుడే మరొకరు ఆక్రమణకు పాల్పడకుండా ఉంటారు. ఆక్రమించుకున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వలనే పాదర్తి ఇరిగేషన్ చెరువు సుమారు 100 ఎకరాలు ఆక్రమణకు గురైంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతానికి వచ్చిన పాపానపోలేదు. మొదటిగా నోటీసులు జారీ చేసి.. అప్పటికీ వినకుంటే కేసులు నమోదు చేయాలి.

– వాటంబేటి శ్రీరాములరెడ్డి, రంగాయపాలెం

**ఉపాధి కోల్పోతాం**



పాదర్తి చెరువులో పెరిగే చిల్లచెట్లను కొట్టుకుని టన్నుల లెక్కన అమ్ముకుని మేము జీవిస్తుంటాము. సుమారు ఆరేడు గ్రామాల గిరిజనులు ఈ చెరువు మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాది పాటు చెరువులోనే కూలి దొరుకుతుంది. ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ, చెరువు ఆక్రమణలు పెరిగిపోతే చిల్లచెట్లు పెరగక మేము ఉపాధి కోల్పోతాం.

– కత్తి శ్రీను, గిరిజన కూలీ, రంగాయపాలెం





**దాండియా సందడి**

దాండియా ఆటలు ఆడ.. సరదా పాటలు పాడ... అంటూ యువతీ యువకులు సందడి చేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఒంగోలులోని మినీ స్టేడియంలో శనివారం రాత్రి నిర్వహించిన దాండియా ఫెస్ట్ అలరించింది.

– సాక్షి, ఒంగోలు

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ ఎస్పీ సుంకర సాయిబాబు

మోటుమాల (కొత్తపట్నం): చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నిత్య జీవితంలో మోసపోకుండా ఉండవచ్చని అడిషనల్ ఎస్పీ సుంకర సాయిబాబు అన్నారు. ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కొత్తపట్నం మండలంలోని మోటుమాల గ్రామం కళామందిరంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి అధ్యక్షత వహించగా, అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. ఏ నేరానికి ఏ శిక్ష పడుతుంది, అసలు నేరం చేయని వారికి అన్యాయం జరిగితే ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయాలను వివరించారు. మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. గృహ హింస, వరకట్నాలు వేధింపులు, భూ సమస్యలు, తదితర చట్టాల గురించి వివరించారు. స్థానిక ఎస్సై వి.సుధాకర్‌బాబు మాట్లాడుతూ న్యాయకళాశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. మీకు ఏదైనా సమస్య వస్తే చట్ట ప్రకారం న్యాయం చేస్తామన్నారు. కళాశాల ఈసీ మెంబర్ బి.మహేష్ వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయకళాశాల ప్రిన్సిపాల్ కె.నటరాజ్‌కుమార్ మాట్లాడుతూ జమిలి ఎన్నికల నిర్వహణ ప్రాముఖ్యత, నిర్వహణలో ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇద్దరు ప్రైవేటు ఉపాధ్యాయులకు పురస్కారాలు

ఒంగోలు: జిల్లాలోని ఇద్దరు ప్రైవేటు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ జగ్గయ్యపేట డివిజన్ వారు శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పురస్కారాల కార్యక్రమంలో మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరుకు చెందిన నేతాజీ హైస్కూలు కరస్పాండెంట్ చీమకుర్తి సాయికిరణ్, నాగులుప్పలపాడు మండలం శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ నన్నపనేని రాజారావు విశిష్ట విద్యాస్థాయి సేవా పురస్కారాలు అందుకున్నారు. జిల్లాకు చెందిన తమ సభ్యులు అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందంటూ వారిని ప్రకాశం జిల్లా ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ జిల్లా కమిటీ ప్రతినిధులు జి.హరిబాబు, కె.ప్రభాకర్, యు.సత్యనారాయణ, రఘుప్రదీప్, షేక్ జమీర్, టి.బాలకృష్ణ, సీహెచ్ తిరుపతిరెడ్డి, జి.కొండగురవయ్య, సహచర విద్యాసంస్థల అధినేతలు అభినందించారు.

## కోడింగ్‌ను విజయవంతంగా పూర్తి చేయాలి

- జవాబు పత్రాల కోడింగ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏకేయూ వీసీ మూర్తి



కోడింగ్‌ను తనిఖీ చేస్తున్న ఏకేయూ వీసీ మూర్తి

ఒంగోలు: జవాబు పత్రాల కోడింగ్ కేంద్రాన్ని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిపాలనా భవనంలో జవాబు పత్రాల కోడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బీఎడ్ మొదటి సెమిస్టర్ జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ మూర్తి కోడింగ్ కేంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌తో మాట్లాడారు. కోడింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్న సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కంట్రోల్ బండిల్ పేపరును నిశితంగా పరిశీలించారు. ఒక్కో కంట్రోల్ బండిల్లో 40 మంది విద్యార్థులకు సంబంధించిన మార్కులు పొందుపరిచే విధంగా రూపొందించడం జరిగిందని వీసీకి ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కోడింగ్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని, అదే విధంగా కోడింగ్ పనులు పూర్తయిన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని కూడా ప్రారంభించాలని ఆయన సూచించారు. మూల్యాంకనం కోసం అవసరమైన ఏర్పాట్లు కూడా వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. బీఎడ్ మొదటి సెమిస్టర్ జవాబు పత్రాల కోడింగ్, మూల్యాంకనం వ్యవహారానికి సంబంధించి ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీనివాస్‌ను వీసీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీటీఈ డాక్టర్ అమతవల్లి, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు నూదా శివరామయ్య, పరీక్షల విభాగం సిబ్బంది, కోడింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వీధికుక్కల నియంత్రణకు కార్యాచరణ



సమీక్షిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: యానిమల్ బర్త్ కంట్రోల్, వీధి కుక్కల నియంత్రణ గురించి ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులతో కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం సమీక్ష నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. ఒంగోలు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారితో వీధి కుక్కలను పట్టించి జియో ట్యాగింగ్ చేసి వాటికి కుటుంబ నియంత్రణ చేయించి ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తిరిగి అక్కడే వదిలిపెట్టాలని ఆదేశాలిచ్చారు. సంఘాల ప్రతినిధులతో వీధి కుక్కల నియంత్రణ కోసం యానిమల్ బర్త్ కంట్రోల్ మానిటరింగ్ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీలోనే ఎన్‌జీఓ సంఘాలకు కూడా సభ్యత్వం కల్పించాలని కమిషనర్ సూచించారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు అవసరమైన అన్ని సదుపాయాలను కొత్త మామిడిపాలెం దగ్గరలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేస్తామని కమిషనర్ వివరించారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు అవసరమైన ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు చివరి స్టేజీలో ఉన్నాయన్నారు. పూర్తయిన వెంటనే 10 రోజుల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మామిడిపాలెం, త్రోవగుంటలో లైసెన్స్ లేని స్లాటర్ హౌసెస్‌ని వెంటనే తీసివేయాలని కమిషనర్‌ను ఎన్‌జీఓ సంఘాల ప్రతినిధులు కోరారు.

## ఇంటి పన్నులు వేగంగా వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఇంటిపన్నులు వేగంగా నూరు శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ వి.జ్యోతి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటి పన్నుల వసూలు విషయంలో మద్దిపాడు మండలం పూర్తిగా వెనుకపడిపోయిందని, అందువలన సచివాలయ సిబ్బంది సహాయం తీసుకుని ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులను ఆమె ఆదేశించారు. పైనుంచి ఉన్నతాధికారులు పదేపదే ప్రశ్నించకుండా సిబ్బందికి అప్పగించిన పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని ఆమె అన్నారు. సర్పంచ్‌లతో మాట్లాడుతూ స్కానింగ్ మిషన్లు కనీసం గ్రామ పంచాయతీకి మూడునాలుగు కొనుగోలు చేయించాలని కోరారు. సమావేశంలో ఏఓ వరప్రసాద్, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.





## అన్నపూర్ణాదేవీ.. పాహిమాం



అన్నపూర్ణాదేవి అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవి



అచలానందాశ్రమంలో గోవిందమాంబదేవి



కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ..



కేశవస్వామిపేటలో కరెన్సీ నోట్లదండతో మహాలక్ష్మిగా..



అన్నపూర్ణాదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

ఒంగోలు మెట్రో: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో పూజలందుకుని భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాలలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీ వాసవీ మెలోడీస్ భక్తి సంగీతం కార్యక్రమం జరిగింది. కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి, కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.